## క్లుప్తంగా

### పోలీసులకు రివార్డులు

భద్రాచలంఅర్బన్: గడిచిన కొంత కాలంగా పట్టణంలోని దొంగతనాలకు పాల్పడిన వారిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు గురువారం స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ పరితోష్ పంకజ్ క్యాష్ రివార్డును అందించారు. రివార్డులు అందుకున్న వారిలో టౌన్ ఎస్సై శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుళ్లు సూర్యరావు, శంకర్, కానిస్టేబుల్ లక్ష్మణ్‌లు ఉన్నారు. భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి పాల్గొన్నారు.

### న్యాయం చేయండి

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర, జిల్లాల విభజనతో ఎంతో నష్టపోయిన భద్రాచలానికి న్యాయం చేయాలని భద్రాద్రి రెవెన్యూ డివిజన్ ప్రజాపరిరక్షణ హక్కుల సమితి గౌరవ అధ్యక్షుడు మారెడ్డి శివాజీ, అధ్యక్షుడు పిలకా రాము కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని పాత మార్కెట్ వద్ద సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు భద్రాద్రి సీతారామ జిల్లాగా నామకరణం చేయాలని కోరారు. పిలకా లక్ష్మారెడ్డి, రాగం నిర్మలానందం, మురికిపూడి గోపి, కొండా స్వామి, ఏసు, డాక్టర్ నగేష్‌రెడ్డి, పి.ధనలక్ష్మి, స్వామి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

### ప్రచారం కోసం ప్రాణాలు తీస్తారా?

దుమ్ముగూడెం: ప్రచార అర్భాటం కోసం ప్రజల ప్రాణాలను తీస్తారా అంటూ బహుజన్ సమాజ్ పార్టీ దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు కంచర్ల సింహాద్రి విమర్శించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం, చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిగిన ఘటన విషయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు, క్షతగాత్రులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా బీఆర్ఎస్‌నే చెల్లించాలని డిమాండ్ చేశారు.

### బాలసానిని కలిసిన నాయకులు

భద్రాచలంఅర్బన్: బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా బాలసాని లక్ష్మీనారాయణను ఇటీవల రాష్ట్ర నాయకత్వం నియమించింది. ఈ సందర్భంగా గురువారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోధబోయిన బుచ్చయ్య, భద్రాచలం మండల కమిటీ నాయకులు బాలసానిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో భద్రాచలం మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కొండిశెట్టి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు చింతా డి.చిట్టిబాబు, రాము, అధికార ప్రతినిధి బల్లా రాంబాబు, డివిజన్ యూత్ అధ్యక్షుడు మల్లెల లోకేష్, సీనియర్ నాయకులు చాట్ల రవి కుమార్ పాల్గొన్నారు.

### ఆవిర్భావ వేడుకలు

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల జనరల్ సెక్రటరీ వాయిస్ ఆఫ్ తెలంగాణ జిల్లా కన్వీనర్ కారం సీతారామయ్య జెండా ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి బి.రాము మాట్లాడారు. మండల కార్యదర్శి నిట్టా రాంబాబు, మణుగూరు మండల ఉపాధ్యాక్షుడు ఎం.రాజు, కరకగూడెం బి.సురేష్, వి.కిరణ్, జనరల్ సెక్రటరీ బి.భాస్కర్‌లు పాల్గొన్నారు.

### అవగాహన సదస్సు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం సబ్ పోస్ట్ ఆఫీస్‌లో గురువారం మహిళ సమ్మాన్ సర్టిఫికెట్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌చార్జ్ ఏఎస్పీ వి.సుచెందర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సబ్ పోస్ట్ మాస్టర్ జానకి రాముడు తెలిపారు. పథకం ద్వారా మహిళలకు ఉపయోగాలపై వివరించారు. మెయిల్ వరుసల్ గోపాల్, బీపీఎంలు, ఏ.బీపీఎంలు పాల్గొన్నారు.

### విజయవంతం చేయాలి

మణుగూరురూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇంటింటికీ సీపీఐ పేరుతో జరుగనున్న సీపీఐ ప్రజాపోరుయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య కోరారు. గురువారం మణుగూరులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15వ తేదీ మణుగూరుకు చేరుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, సుధాకర్, మోహన్‌రావు, సర్వర్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని చర్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి పోతయ్య, రాష్ట్ర సమితి సభ్యులు వెంకటేశ్వరవు, జిల్లా సమితి సభ్యుడు తాతాజీ పాల్గొన్నారు.

దమ్మపేట: యాత్ర పోస్టర్లను ఆ పార్టీ నాయకులు గురువారం ఆవిష్కరించారు. యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. శివకృష్ణ, ధర్మ, జాన్‌బీ, మురళి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# తేనెటీగలతో తస్మాత్ జాగ్రత్త

- జనావాసాల్లోని చెట్లపై తేనెపట్టులు
- ఒక్కసారిగా ముసురుతుండడంతో ఆందోళన
- వరుస ఘటనలతో అలర్ట్


తేనె పట్టు

బూర్గంపాడు: తేనె పేరు వినగానే అందరికీ నోరూరుతుంది. కాని తేనెటీగ కుడితే మాత్రం భరించలేం. తేనెటీగ కుడితే విపరీతమైన నొప్పి, దద్దుర్లు వస్తాయి. ఎక్కువ సంఖ్యలో తేనెటీగలు కుడితే ప్రాణాలు పోయే ప్రమాదముంది. ఇటీవల తేనెటీగలు దాడిలో గాయపడి చాలామంది తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అలా గాయపడి ఇటీవల బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లో ఇద్దరు యువకులు ప్రాణాలే పోగొట్టుకున్నారు.

**కుడితే ఏం జరుగుతుంది..**

చెట్లపైకి ఎక్కి కొమ్మలు నరికే సమయంలో, పొలం పనులు చేసుకునే సమయంలో ఏమాత్రం తేనెపట్టులకు ఇబ్బందులు కలిగిన వెంటనే వేలాదిగా తేనేటీగలు పైకి లేచి ఆ ప్రాంతంలో ఉన్న మనుషులపై, పశువులపై దాడి చేస్తాయి. తేనెటీగలు కుట్టినప్పుడు శరీరంలో దిగిన ముల్లుల వల్ల తీవ్రమైన నొప్పి, దద్దుర్లు వస్తాయి. తేనెటీగ ముల్లులో ఉండే విషం (మెల్లిటిన్) అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఈ విషం రోగ నిరోధక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తేనెటీగలు కుట్టిన వెంటనే వాపు, దద్దుర్లు, కడుపులో వికారం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది.

**నియోజకవర్గంలో వరుస ఘటనలు..**

ఇటీవల బూర్గంపాడు నియోజకవర్గంలో తేనెటీగల దాడిలో చాలామంది గాయపడుతున్నారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన గొర్ల గంగులు ఐదురోజుల క్రితం తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. విద్యుత్‌శాఖలో హెల్పర్‌గా పనిచేస్తున్న గంగులు విద్యుత్‌తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను నరుకుతున్న క్రమంలో చెట్టుపైన ఉన్న తేనెపట్టులోని తేనేటీగలకు పైకిలేచి అతనిపై దాడిచేసి తీవ్రంగా కుట్టాయి. అతనిని తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్న క్రమంలో మృతిచెందాడు. ఈ ఏడాది దసరా పండుగ రోజున బూర్గంపాడు మండలం సారపాకలో చెలికాని సతీష్ అనే యువకుడు ఇంటిముందున్న వేపచెట్టు కొమ్మను నరుకుతున్న క్రమంలో తేనెటీగలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. అతను ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ మృతిచెందాడు. బూర్గంపాడు మండలం కొమ్మునకిరిపేట గ్రామానికి చెందిన వర్సా భద్రయ్య పొలం పనులు చేసుకుంటున్న సమయంలో తేనెటీగలు కుట్టి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మూడురోజుల పాటు ఆస్పత్రిలో చికిత్సలు పొంది కోలుకున్నాడు. ఇరవెండిలోని పంప్‌హౌస్‌ను పరిశీలించేందుకు వెళ్లిన ప్రజాప్రతినిధులపై కూడా తేనెటీగలు దాడిచేసిన ఘటనలున్నాయి.

**జాగ్రత్తలు తప్పనిసరి..**

పొలం పనులకు, అటవీప్రాంతాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా చెట్లను పరిశీలించాలి. తేనేపట్టు ఉంటే జాగ్రత్తలు వహించాలి. అదేవిధంగా పిక్నిక్‌లకు, విహారయాత్రలకు వెళ్లినప్పుడు కూడా ఆయా ప్రాంతాల్లో తేనెపట్టులను గమనించి జాగ్రత్తగా వ్యవహరించాలి. ఏమాత్రం ఆదమరిచిన ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లే.

**సత్వర చికిత్స అవసరం**

తేనెటీగలు కుట్టి దద్దుర్లు, వాపు వచ్చిన వెంటనే అక్కడ ఐస్ క్యూబ్‌లు పెట్టాలి. కడుపులో వికారం, వాంతులు, అలెర్జీ వస్తే వెంటనే వైద్యులు సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలి. శ్వాస ఆడకపోతే వెంటనే సీపీఆర్ చేయించాలి.

– డాక్టర్ నవీన్, సూపరింటెండెంట్, బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రి

# స్కానింగ్ సెంటర్ల తనిఖీ


స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు

భద్రాచలంఅర్బన్: డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం డి.ఫైజ్ మొయినుద్దీన్ బృందం గురువారం భద్రాచలంలోని పలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సిబ్బందికి పీసీ అండ్ పీఎన్డీటీ యాక్టు-1994 ప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించాలో వివరించారు. 'ఎఫ్'ఫారంను ఎలా నింపాలి, తదనంతరం దానిని ఎలా ఆన్లైన్ చేయాలో సిబ్బందికి వివరించారు. అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్‌ను ఇంకొక చోటికి తరలించినా, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, లోపాలపై డీఎం అండ్‌హెచ్‌ఓకు నివేదిక ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం


అధికారులకు సూచనలిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ చొరవతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. వైద్యచికిత్సలు పొందుతున్న రోగులను పరామర్శించి.. అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో కావాల్సిన వసతులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్‌లో రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను, మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ్‌నగర్‌లో సుమారు రూ.50 లక్షలతో చేపడుతున్న సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులను ఆయన సందర్శించి పరిశీలించారు. పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనుల పరిశీలన**

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌లో నిర్మిస్తున్న సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులను తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదర్శనగర్‌లో సైడ్ కాలువల కోసం సుమారు రూ.50 లక్షలు అంచనా వ్యయంతో నిర్మాణం జరుగుతుందన్నారు. పనులు మరింత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, మున్సిపాలిటీ సిబ్బంది, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన


సైడ్ డ్రైయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జెడ్పీటీసీ పోశం నర్సింహారావు

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని సమితిసింగారంలో అభివృద్ధి పనులకు గురువారం ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నర్సింహారావులు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ.. మణుగూరు మండల పరిషత్ నిధులతో సమితిసింగారం పంచాయతీ పరిధిలోని పద్మశాలిభవన్ దగ్గర రూ.లక్షా 80వేలతో, రిక్షా కాలనీలో రూ.8 లక్షలతో, రాజీవ్‌గాంధీనగర్‌లో రూ.4 లక్షలతో, ముత్యాలమ్మనగర్‌లో రూ.5 లక్షలతో సైడ్ డ్రెయిన్ల నిర్మాణాల కోసం శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చల భారతి, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముత్యంబాబు, వార్డుసభ్యులు ఉపేందర్, ఎంపీడీఓ వీరన్న, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏఈ రామారావులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు నిర్మాణం..**

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి 102 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. సుమారు రూ.5 లక్షల పీఎంవైఏ నిధుల నుంచి ఈ సీసీ రోడ్డు రహదారిని నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెనుబల్లి సీతమ్మ, సర్పంచ్ తొడెం తిరుపతిరావు, ఉపసర్పంచ్ అపక గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి సంపత్ శ్రీనివాస్, వార్డు మెంబర్లు సొందె తాయలమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కాలనీల్లో పంచాయతీ అధికారులు బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేయించారు. పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుధ్య పనులు మందగించడంతో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు ఏర్పాడడంతో ఈ నెల 12న సాక్షి దినపత్రికలో 'లోపించిన చి(చె)త్తశుద్ధి'అను శీర్షికన పథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు.. సిబ్బందితో పట్టణంలోని ఆయా కాలనీల్లో రోడ్లపై ఉన్న చెత్తను తొలగించారు. ఇకపై పట్టణంలోని అన్ని కాలనీలకు చెత్త సేకరణ వాహనం వెళ్లేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు తెలిపారు.


రోడ్లుపై ఉన్న చెత్తను తొలగించిన పంచాయతీ సిబ్బంది

### గ్రంథాలయానికి వైఫై

భద్రాచలంఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వేముల కామేశ్వరరావు తాతగుడి సెంటర్‌లోని ప్రభుత్వ శాఖాగ్రంథాలయానికి వైఫై సదుపాయం కల్పించారు. 100 మంది విద్యార్థులు 100 ఎంబీపీఎస్ వేగంతో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, మెటీరియల్, ఆన్లైన్ మాగజైన్లు డౌన్లోడ్ చేసుకునేందుకు, చదువుకోవటానికి ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసి లైబ్రరీ ఇన్‌చార్జ్ ఎస్‌కె.జానీకి గురువారం అందజేశారు. ఒక సంవత్సర పైకాన్ని చెల్లించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అన్నపురెడ్డిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని మైబునగర్ గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ తన ద్విచక్ర వాహనంపై గురువారం ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బూర్గుగూడెం మూలమలపు దగ్గర కొత్తగూడెం నుంచి వస్తున్న బస్సును ప్రమాదవశాత్తు పక్క నుంచి ఢీకొట్టాడు. హుస్సేన్ తలకు గాయాలు కాగా, ఖమ్మం తరలించారు.

### వీల్‌చైర్ అందజేత

భద్రాచలంఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన కూర రాముకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ బాధ్యులు గురువారం వీల్‌చైర్ అందజేశారు. ఈ మేరకు రాము సతీమణికి భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ చేతుల మీదుగా వీల్‌చైర్ అందజేయగా ఆయన ఆర్యవైశ్య మహాసభ బాధ్యులను అభినందించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కంభంపాటి సురేష్‌కుమార్‌తో పాటు వుడత నగేష్‌కుమార్, బండారు కృష్ణయ్య, సంకా కృష్ణార్జునరావు, రేపాక శ్రీనివాస్, శ్రీరాం సునీల్, జయశంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### క్రీడాకారులకు అభినందన

భద్రాచలంఅర్బన్: హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులకు రెండు బంగారు పథకాలు, ఒక సిల్వర్ పథకం సాధించగా.. విజేతలను, జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డిని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం ఆయన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఉపాధ్యక్షుడు వి.మల్లేష్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ తిరుమలరావు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వసంతరావు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ట్రెజరర్ భోగాల వీరారెడ్డిలు వారిని అభినందించారు.

### బీఆర్ఎస్‌లో చేరిక

మణుగూరురూరల్: మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆళ్లపల్లి మండలం రామంజిగూడెం గ్రామపంచాయతీకి చెందిన సుమారు 20 కుటుంబాల వారు వివిధ పార్టీలను వీడి ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

### సీపీఎం నాయకుడి వర్ధంతి

భద్రాచలంఅర్బన్: దివంగత సీపీఎం నాయకుడు కాపుల వెంకటేశ్వర్లు వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకటరామారావు అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేయగా.. మచ్చా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా మాట్లాడారు. నాయకులు ఎం.రేణుక, బండారు శరత్‌బాబు, పి.సంతోష్‌కుమార్, నాదెళ్ల లీలావతి, యు.జ్యోతి, డి.సీతాలక్ష్మి, కుంజా శ్రీనివాస్, జి.లక్ష్మీకాంత్, కోరాడ శ్రీనివాస్, చేగొండి శ్రీనివాస్‌తో పాటు కాపుల లక్ష్మి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య రక్షణతోనే నివాళి


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదానం

భద్రాచలంఅర్బన్: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్న నేపథ్యంలో దానిని కాపాడుకోవడం ద్వారా అంబేద్కర్‌కు ఘన నివాళి అర్పించినట్లవుతుందని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా భద్రాచలంలో సీపీఎం ఆధ్వర్యాన 'భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం-ఎదురవుతున్న సవాళ్లు'అనే అంశంపై గురువారం సదస్సు ఏర్పాటు చేశారు.

సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రమేష్‌కుమార్ మక్కడ్, కోట దేవదానం మాట్లాడారు. సదస్సులో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కారం పుల్లయ్య, గడ్డం స్వామి, అరికెళ్ల తిరుపతిరావు, సరెళ్ల నరేష్, కుంచాల రాజారాం, అలవాల రాజా, పూనం వీరభద్రం, చల్లగుల్ల నాగేశ్వరరావు, జీఎస్.శంకర్‌రావు, తాళ్లపూడి రాము, పల్లంటి దేశప్ప తదితరులు పాల్గొన్నారు.

### వాసవీక్లబ్ మండల అధ్యక్షుడిగా సుధాకర్



ములకలపల్లి: వాసవీక్లబ్ మండల అధ్యక్షుడిగా బిక్కుమళ్ల సుధాకర్ ఎన్నికయ్యారు. ములకలపల్లిలో జరిగిన సంఘ సమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా సుధాకర్‌తోపాటు, ప్రధాన కార్యదర్శిగా వనమా వెంకన్న, కోశాధికారిగా గంగిశెట్టి కామేశ్వరావులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు కొదుమూరి వీరగోపాల్, అత్యం రాంబాబు, బిక్కుమళ్ల వేణు, పద్దం బుజ్జి, పుల్లూరి వేణుగోపాల్, పెడిమర్రి వెంకన్న, ఓబులశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

### ఆయుర్వేద వైద్య శిబిరం

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలైన వేములూరు, మనుబోతులగూడెం గ్రామాల్లో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాలు నిర్వహించారు. సర్పంచ్ ఏనిక స్వరూప ప్రారంభించారు. వైద్యాధికారి జి.అరుణ, డాక్టర్ ఎం.ఉమాదేవి రెండు గ్రామాల్లో 300 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమరం రాంప్రసాద్, కార్యదర్శి కోడి నరేందర్, ఏనిక శివాజీ, ఆశ వర్కర్లు మనెమ్మ, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

### కంటి వెలుగు శిబిరం

అన్నపురెడ్డిపల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు తన్మయి కోరారు. మండల పరిధిలోని తాటి బుచ్చన్నగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో ఆమె పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో ఇటీవల తేనెటీగల దాడిలో మృతి చెందిన గొర్ల గంగులు కుటుంబానికి మాజీ సర్పంచ్, సీపీఎం సీనియర్ నాయకుడు స్వర్గం బాలనర్సయ్య ఆధ్వర్యంలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు దండి రాములు, బొడ్డు రాములు, పగడాల అశోక్‌రెడ్డి, ఆవుల సుధాకర్, తూము వెంకన్న, కొప్పుల పద్మ, వెంకటరమణ, శ్రీకాంత్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు డిపోకు కొత్త బస్సులు

మణుగూరుటౌన్: మణుగూరు డిపో పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం పాత బస్సుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. గురువారం సురక్షా బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఫ్రిజ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని చల్లని నీటిని అందించేందుకు ఫ్రిజ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మణుగూరు డిపో నుంచి అమలాపురం, తిరుపతి, హైదరాబాద్ రూట్లలో కొత్త బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ కనకదుర్గ, సూపరింటెండెంట్ పర్సనల్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ మెకానికల్ మూర్తి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, డిపో క్లర్క్ సుధాకర్, సుగుణ కుమారి, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ సైదులు, కేఎస్.నారాయణ, డీఐ పీవీ రెడ్డి, రాంబాబు, పీవీలు, జెఎస్ రావు, సామ్రాజ్యం, ఆంటోని మహేందర్‌లు పాల్గొన్నారు.

# బకాయిలు చెల్లించని దుకాణాలు సీజ్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డులోని మూడు దుకాణాలను గ్రామ పంచాయతీ అధికారులు గురువారం సీజ్ చేశారు. గ్రామ పంచాయతీ నుంచి దుకాణాలను అద్దెకు గత సంవత్సరం నవంబర్ నుంచి నెలవారి అద్దెను చెల్లించకపోవడంతో సీజ్ చేశారు. గతంలో ఉన్న పంచాయతీ అధికారుల చొరవతో సంబంధిత దుకాణాల నిర్వాహకులు అద్దెను చెల్లించడం లేదని, మూడు సార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేదని తెలియవచ్చింది. వీలైనంత త్వరగా మిగిలిన దుకాణాల నిర్వహకులు అద్దె బకాయిలు చెల్లించాలని, లేదంటే వాటిని కూడా సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.

# సమ్మె దిశగా విద్యుత్ ఉద్యోగులు


బయ్యారం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఉద్యోగులతో సమావేశమైన యూనియన్ నాయకులు

పినపాక: విద్యుత్ ఉద్యోగులు పీఆర్సీ అమలులో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఆందోళనలకు సిద్ధమవుతున్నామని 1102 యూనియన్ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ బయ్యారం సబ్ స్టేషన్‌లో కరకగూడెం, పినపాక, మణుగూరు ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నెల 17 నుంచి నిరవధిక సమ్మెకు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు గురిచేసిన సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్, మణుగూరు డి.జీవన్ కుమార్, కోచైర్మన్ బి.రామకష్ణ, జాయింట్ సెక్రెటరీ వెంకటరాజు, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు ఉదయరత్న, బీసీ సంఘం నాయకులు సీతారాములు, బయ్యారం ఏఈ కావ్య, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# పొంగులేటి వర్గీయుల రాజీనామా


కరకగూడెం: బీఆర్ఎస్‌కు రాజీనామాను ప్రకటిస్తున్న నాయకులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పొంగులేటిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాజీనామాలు చేశారు. వారిలో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ బోడాపద్మ, ఉప సర్పంచ్ పర్సా వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు చల్లా శ్రీను, దారావత్ శ్రీను, మల్లెల కుమారి, నాయకులు మరకాల లక్ష్మారెడ్డి, దుబ్బాకుల రాము, నాగేశ్వరరావు, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

కరకగూడెం: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బీఆర్ఎస్ అధిష్టానం పార్టీ నుండి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆయన అనుచరులు, అభిమానులు మండలంలోని రాళ్లవాగు వద్ద సమావేశమై బీఆర్ఎస్ పార్టీకి రాజీనామ చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల కార్యదర్శి ఎర్ర సురేష్, అనంతారం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ అత్తె సత్యనారాయణ, మాజీ ఎంపీటీ బిజ్జ రామనాథం, నాయకులు పడిగ సమ్మయ్య, వార్డు మెంబర్ రాజేష్, జలగం కృష్ణ, అలెం నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పినపాక: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పార్టీ నుంచి తప్పించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ పొట్లపల్లి ఉప సర్పంచ్, పలువురు వార్డు మెంబర్లు, మాజీ మండల అధ్యక్షుడు, మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం పార్టీకి రాజీనామా చేశారు. బయ్యారం క్రాస్ రోడ్ లోని జీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. తమ నిర్ణయాన్ని తెలియజేశారు. ఎటువంటి పదవులు ఆశించకుండా తొమ్మిది సంవత్సరాలు పార్టీకి సేవలందించినందుకు పొంగులేటిని సస్పెండ్ చేయడం దారుణం అన్నారు. ఇంటింటికి తిరిగి రేగా అక్రమాలపై ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో ఓడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉడుముల లక్ష్మారెడ్డి, పెరం వెంకటేశ్వరరావు, పొట్లపల్లి ఉపసర్పంచ్ కస్తూరి లింగయ్య, ఉడుముల రవి, సమ్మయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.